## బీఆర్‌ఎస్‌కు నీరా‘జనం’



# ప్రజా సంక్షేమమే ధ్యేయం



లక్షెట్టిపేట : పార్టీలో చేరిన వారితో బీఆర్‌ఎస్ నేతలు

- మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు
- లక్షెట్టిపేటలో కార్యకర్తలతో సమావేశం
- హాజరైన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ భానుప్రసాద్

లక్షెట్టిపేట, అక్టోబర్ 20 : ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తే మరింత అభివృద్ధికి పాటుపడుతానని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని పథకాలు ఇక్కడే అమలవుతున్నాయని, ప్రజలు గమనించి మూడో సారి కూడా బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. అదేవిధంగా పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు, గూడెం ఎత్తిపోతల పథకం, చెల్లంపేట ప్రాజెక్టుతో పాటు ఇటీవల హాజీపూర్ మండలంలోని పడ్తన్‌పల్లిలో మరో 1000 ఎకరాలకు సాగునీరు అందేలా చెక్‌డ్యాం పనులను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి గానీ ఓటు వేస్తే బురదలో పోసిన పన్నీరు అవుతుందన్నారు. ఎమ్మెల్సీ భాను ప్రసాద్ మాట్లాడుతూ క్లబ్‌లు, సంపాదన కోసం పాటు పడే మనిషికి మంచిర్యాలను అప్పగిస్తే మనం చాలా నష్టపోవల్సి వస్తుందన్నారు. అందుకే అహర్నిషలు శ్రమించే బీఆర్‌ఎస్ అభ్యర్థి దివాకర్‌రావును మరోసారి గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఇటీవల మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన జడ్పీటీసీ చిన్నయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ విధి విధానాలు నచ్చకనే బీఆర్‌ఎస్‌లో చేరానన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చే ఏ హామీ కూడా తీర్చుతుందనే నమ్మకం తనకే కాదు ఆ పార్టీ నాయకులకు లేదన్నారు. అనంతరం జడ్పీటీసీ ముత్తె సత్తయ్య నేతృత్వంలో మండలం నుంచి వివిధ గ్రామాలకు చెందిన సుమారు 1000 మంది కార్యకర్తలు, మహిళలు, యువకులు జడ్పీటీసీ సత్తయ్య అభిమానులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు పార్టీ శ్రేణులు, నాయకులు, జడ్పీటీసీ అభిమానులు వేల సంఖ్యలో పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరవింద్‌రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, రైతుబంధు సమితి చైర్మన్ మోటపల్కుల గురువయ్య, మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, పార్టీ మండలాధ్యక్షుడు చుంచ చిన్నయ్య, పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అంకతి రమేశ్, ప్రధానకార్యదర్శి కేతిరెడ్డి అనిల్ రెడ్డి, నడిపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, మాజీ ఎంపీపీ కట్ల చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ గోళ్ల కాంతయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గోళ్ల రవీందర్, ప్రధానకార్యదర్శి ఆసాది పురుషోత్తం, యూత్ మండలాధ్యక్షుడు అంకతి గంగాధర్, కౌన్సిలర్లు సురేశ్ నాయక్, చాతారాజు రాజన్న, మెట్టు కల్యాణిరాజు, షబానా సజ్జు, నాయకులు అంకతి మల్లేశ్, చుంచు శ్రీనివాస్, చంద్రమౌళి, ముత్తె రాజ్‌కుమార్, బియ్యాల సుధాకర్, కేతిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, సందెల వెంకటేశ్, రాజేశం, మోటపల్కుల శ్రీనివాస్, గుర్రాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఓర్వలేకే తప్పుడు ప్రచారం

హాజీపూర్, అక్టోబర్ 20 : రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే దివాకర్ రావు మండిపడ్డారు. మండలంలోని ముల్కల్ల గ్రామంలో సర్పంచ్ మంచాల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావు వివిధ బ్యాంకులకు రూ. 800 కోట్లు అప్పు ఉండి ప్రజలకు ఏమీ సేవ చేస్తాడని ప్రశ్నించాడు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కుడుక సత్యం, మండల ప్రధాన కార్యదర్శి మాధవరపు జీవన్ రావ్, మండల యువత అధ్యక్షుడు దొమ్మటి బాపు, నాయకులు తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పోచమ్మ గుడి వద్ద నృత్యాలు చేస్తున్న మహిళలు

# జంగుబాయి సన్నిధిలో ముందస్తు దసరా

- ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన భక్తజనం
- నవధాన్యాలతో అమ్మవారికి నైవేద్యం
- సంప్రదాయ వాయిద్యాల నడుమ పూజలు

కెరమెరి, అక్టోబర్ 20 : ఆదివాసుల ఆరాధ్య దేవత జంగుబాయి సన్నిధిలో గురువారం రాత్రి ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని మహారాజ్ గూడ అటవీ ప్రాంతంలోని 8 గోత్రాల కటోడాల సమక్షంలో జరిగిన ఈ పండుగకు ఉమ్మడి జిల్లాల ఆదివాసులతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సహ్యాద్రి పర్వతంలోని గుహలో కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకూ మారుమూల గ్రామాల నుంచి భక్తజనం పిల్లపాపలతో కలిసి ఎంతో ఉత్సాహంగా తరలివచ్చారు. వానకాలం సీజన్‌లో పండించిన నవధాన్యాలను ఒకచోట సేకరించి ప్రత్యేక నైవేద్యాన్ని తయారు చేశారు. అనంతరం సంప్రదాయ వాయిద్యాలతో సామూహిక పూజలు చేసి గుహల వద్ద అమ్మవారికి తీపి వంటకాలు, మైసమ్మ, రావుడ్క్ పేన్, పోచమ్మ తల్లి వద్ద కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడే వంటలు వండి సహపంక్తి భోజనం చేశారు.

# బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

**బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

బెల్లంపల్లి, అక్టోబర్ 20: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మరోసారి సీఎం కేసీఆర్ సర్కార్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. తాండూర్ మండలం బోయపల్లికి చెందిన ఇతర పార్టీల నాయకులు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో పెద్ద ఎత్తున చేరుతుండడంతో పార్టీ మరింతగా బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, ప్రతిపక్ష పార్టీలు ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగేందుకే భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా తాండూర్ మండల ఇన్‌చార్జి హనీఫ్, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్వరాష్ట్రంలోనే జోడేఘాట్‌కు గుర్తింపు



చిన్నపాట్నాపూర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న కోవ లక్ష్మి

- ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి
- పలు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం

కెరమెరి, అక్టోబర్ 20 : స్వరాష్ట్రంలోనే జోడేఘాట్‌కు గుర్తింపు వచ్చిందని జడ్పీ చైర్‌పర్సన్, ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని జోడేఘాట్, కొలాంగూడ, పెద్ద పాట్నాపూర్, చిన్న పాట్నాపూర్, బాబేఝరి, మహారాజ్‌గూడ, శివగూడ, పాటాగూడ, పిట్టగూడ, టోకెన్‌మోవడ్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి, ఆత్రం సక్కుకు డప్పువాయిద్యాలు, హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి గూడేల్లో ప్రజల బాగోగులు తెలుసుకుంటూ, సర్కార్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ సుపరిపాలన దేశానికే ఒక రోల్ మోడల్‌గా మారిందని, ఇక్కడ అమలవుతున్న పథకాలు చూసి కేంద్రంతో పాటు పొరుగు రాష్ట్రాలు కూడా ప్రశంసిస్తున్నాయని చెప్పారు. ఒకప్పుడు జోడేఘాట్‌లో సౌకర్యాలు లేక గ్రామం వీడాల్సిన దుస్థితికి రాగా, గ్రామస్తులకు నచ్చజెప్పి కొంతకాలం ఆగండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తుందని సమస్యలన్నీ తీరిపోతాయని ఆ రోజే చెప్పామన్నారు. ప్రస్తుతం జోడేఘాట్ అందరికి ఆదర్శంగా మారిందని, కేసీఆర్ సంకల్పం వల్ల ఇచ్చిన మాటకు కట్టుబడి పోరుగడ్డను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారని చెప్పారు. కల్లిబొల్లి మాటలతో చెప్పి అధికారంలోకి రావాలని చూస్తున్న ఇతర పార్టీలను నమ్మి మోసపోవద్దన్నారు. ఆదివాసులకు పోడుభూముల పట్టాలతో పాటు రైతుబంధు అందించి ఆదుకున్న బీఆర్‌ఎస్ పార్టీకే అండగా నిలవాలని, రానున్న రోజుల్లో మరింత సంక్షేమం, అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. మూడో సారి అధికారంలోకి రాగానే అందరికి గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు నిర్మించేందుకు రూ.3 లక్షలు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావ్, ఎంపీపీ పెందోర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబూల్ కలాం, మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖౌత్బొద్దీన్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కుమ్రం నాణేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు రాథోడ్ ఉత్తం నాయక్, షేక్ యూనుస్, రఘునాథ్, దుందురావ్, తిరుపతి, తొడసం జగన్నాథ్‌రావ్, ధర్ము, వెంకటేశ్వర్, ఇష్తేకర్ అహ్మద్, కుడ్మెత సోముతో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతికతను వినియోగించుకోవాలి



డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు

తిర్యాణి,అక్టోబర్ 20 : వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. మండలంలోని గంభీరావుపేటలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో భారతీయ వరి పరిశోధనా స్థానం రాజేంద్రనగర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా వరి పంటలో పురుగు, తెగుళ్ల నివారణ మందు, ఎరువుల పిచికారీపై రైతులకు శుక్రవారం ప్రదర్శన, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వ్యవసాయం చేయడం సులభతరం అవుతుందన్నారు. సరైనా సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల సమయం ఆదాతో పాటు ఎక్కువ విస్తీర్ణంలో పంటలను కాపాడి మంచి దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు. ఎకరం పొలానికి ఐదు నుంచి ఆరు నిమిషాల్లో స్ప్రే చేయవచ్చని తెలిపారు. ఈ డ్రోన్ క్లిక్ చేసిన ఫొటోలు, చిత్రాలను ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా మరింత విశ్లేషించవచ్చని తెలిపారు. అలాగే తెగుళ్లు, వాటి తీవ్రతకు సంబంధించిన సమాచారాన్ని ఇందులో పొందవచ్చన్నారు. సమతుల్యంగా లేని నేల, కొండ ప్రాంతాల్లో పండించిన పంటలపై మందులను కూడా పిచికారీ చేయడం సులభం అవుతుందన్నారు. ఏవో తిరుమలేశ్వర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీధర్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, ఏఈవోలు ముత్తయ్య, సాగర్, ఆదిత్య, డ్రోన్ ప్రతినిధులు సంతోష్ రెడ్డి, సందీప్, రాజేశ్, ఆయా గ్రామాల్లోని రైతులు పాల్గొన్నారు.